నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 18 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL



- ఘనంగా నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- సంస్కృతీ సంప్రదాయాల నడుమ వారసుల పూజలు
- వేలాదిగా తరలివచ్చిన అడవిబిడ్డలు, జనసంద్రమైన పోరుగడ్డ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఆకట్టుకున్న స్టాళ్లు
- హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచిత బస్సు సౌకర్యం
- పోలీసుల భారీ బందోబస్తు

వీరుడికి వందనం

జోడేఘాట్‌లో అధికారికంగా కుమ్రం భీం, సూరు వర్ధంతి



భీంకు నివాళులర్పిస్తున్న మనువడు కుమ్రం సోనేరావ్, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, అక్టోబర్ 17 : జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన ఆదివాసీ ముద్దుబిడ్డ, గిరిరత్న కుమ్రంభీంను యావత్ ప్రజానీకం స్మరించుకున్నది. గురువారం జోడేఘాట్‌లో భీం, కుమ్రం సూరు వర్ధంతిని అధికారికంగా నిర్వహించగా, తెలంగాణ నుంచేగాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అడవిబిడ్డలతో పోరుగడ్డ పులకించింది. డప్పు చప్పుళ్లు, సన్నాయి, కాలికోం వాయిద్యాలు.. ఆటా పాటలతో ఆ ప్రాంతం మారుమోగింది. భీం మనువడు కుమ్రం సోనేరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మంత్రి సీతక్క(ధనసరి అనుసుయ), ఆసిఫాబాద్, ఖానాపూర్, సిర్పూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మా భొజ్జు, పాల్వాయి హరీశ్‌బాబు, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఎస్పీ డీ.వీ.శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతోపాటు ఆదివాసీ సంఘాల నాయకులు హాజరై సామూహిక పూజలు చేశారు. అమరవీరుల జెండాలను ఎగురవేశారు. అనంతరం భీం విగ్రహం, సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుమ్రం సూరు మనువడు కుమ్రం పాండు ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కొలాం ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా నివాళులర్పించారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలపై ఆదివాసీలు నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. వర్ధంతి సందర్భంగా హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. సభకు వచ్చిన మహిళలు, పురుషులు, వీఐపీలు, పోలీసులు, మీడియాకు వేర్వేరుగా తాగునీరు, భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, కన్వీనర్ మోతీరాంతో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భీం 84వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన దర్బార్‌లో ఆదివాసీ కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోండి, తెలుగు భాషలో కళాకారులు పాడిన పాటలు, గుస్సాడీ, డెంస్సా నృత్యాలు కనువిందు చేశాయి. గోండ్, ప్రధాన్, కొలాం, తోటి, నాయక్‌పోడ్, మొత్తం 9 తెగల ఆదివాసీలు తమ ఆచార వ్యవహారాలు, సంస్కృతిని ప్రదర్శించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరంతో పాటు మొబైల్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల విభాగంలో అర్జీలను స్వీకరించారు.

భారీ పోలీసు బందోబస్తు..

భీం సంస్మరణ సభ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రహదారి పొడువునా తనిఖీలు చేపట్టారు. పహారాకాశారు.

పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి

- రైతులకు గుజరాత్ ధర చెల్లించాలి
- బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రాన్ని ఒప్పించాలి
- సోయా పది క్వింటాళ్లు కొనాలి
- మాజీ మంత్రి జోగు రామన్న

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి సీజన్‌కు ముందే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులతో మాట్లాడి కొనుగోళ్లు, మద్దతు ధర విషయంలో చర్యలు తీసుకోకపోవడంతో జాప్యం జరుగుతుందన్నారు. దిగుబడులు వస్తున్నా సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభంకాకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు పంటను విక్రయించే ప్రమాదం నెలకుందని తెలిపారు. సోయాబిన్ దిగుబడులు ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు వచ్చాయని, ప్రభుత్వం ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే సేకరిస్తుండడంతో మిగిలిన పంటను దళారులకు విక్రయించి నష్టపోతున్నారన్నారు. సోయా ఎకరాకు పది క్వింటాళ్లు కొనాలని ఫోన్‌లో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడినట్లు గొప్పలు చెప్పుకున్నారని కొనుగోళ్లు మాత్రం పెరగలేదన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రాన్ని ఒప్పించి గుజరాత్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వింటాలుకు రూ.7,521 ధర ఉండగా కేంద్రమంత్రులను కలిసి ఆదిలాబాద్ జిల్లా రైతులకు గుజరాత్ మాదిరి పత్తి క్వింటాలుకు రూ.8,257 ఇప్పించాలన్నారు. గుజరాత్ పత్తి స్టేబల్ 31 ఉంటే ఆదిలాబాద్ పత్తి 33 ఉంటుందని యార్న్ కూడా బాగుంటుందని తెలిపారు. ఆదిలాబాద్‌లో సీసీఐ సేకరించిన పత్తి బేళ్ల ధర ఎక్కువ ఉంటుందన్నారు. ప్రైవేటు వ్యాపారుల పత్తిని ఎక్కువ ధరకు కొనుగోలు చేసేలా సీసీఐ వాణిజ్య కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరేలా ఇంద్రవెల్లి, నార్నూర్‌లలో సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలన్నారు. పంటల కొనుగోళ్ల విషయంలో న్యాయం జరగకపోతే రైతుల తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, యానిస్ అక్బానీ, విజ్జిగిరి నారాయణ, యాసం నర్సింగరావు, మొట్టు ప్రహ్లాద్, జగదీశ్, ప్రహ్లాద్, జగదీశ్వర్, కొమ్ర రాజు, సతీష్‌లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం, అక్టోబర్ 17 : ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం అబ్దుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తీసుకెళ్లిన సమయంలో మిల్లర్లు ఇబ్బంది పెడితే తెలపాలని సూచించారు. 18వ తేదీ సాయంత్రం లోపు కేంద్రాలకు గన్నీ బ్యాగులను సరఫరా చేస్తామని తెలిపారు. 20వ తేదీలోపు కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాతావరణంలో మార్పులు వస్తున్నందున ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, తహసీల్దార్ మోతిరాం ఉన్నారు.

అలుపెరగని పోరాటాలు చేసిన కుమ్రం భీం

మాజీ మంత్రి జోగు రామన్న

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 17 : 'జల్ జంగల్ జమీన్' కోసం అలుపెరగని పోరాటాలు చేసిన మహనీయుడు కుమ్రం భీం అని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం చౌక్‌లో వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి భీమ్‌కు నివాళులర్పించారు. కుమ్రం భీం విగ్రహానికి మొదటిసారి అధికారికంగా ఘన నివాళులర్పించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. పట్టణాధ్యక్షుడు అజయ్, రోకండ్ల రమేశ్, నారాయణ, మెట్టు ప్రహ్లాద్, మెస్రం పరమేశ్వర్, కుమ్ర రాజు, కొండ్ర జంగుబాపు, కుమ్ర రాజు పటేల్, మరపరాంచందర్, లక్ష్మణ్, రాంచందర్, లక్ష్మణ్, మోతీరాం పాల్గొన్నారు.

భీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

భీం ఆశయాలు గొప్పవి

- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 17 : జల్, జంగల్, జమిన్ కోసం పోరాడిన ఆదివాసీ ముద్దు బిడ్డ కుమ్రం భీం ఆశయాలు గొప్పవని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భీం 84వ వర్ధంతి పురస్కరించుకుని గురువారం పట్టణంలోని బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భీం ఆదివాసుల హక్కుల కోసం చేసిన పోరాటం, త్యాగం ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఏఎస్పీ సురేందర్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మున్సిపల్ కమిషన్ ఖమర్‌అహ్మద్ పాల్గొన్నారు.

వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

ఎదులాపురం, అక్టోబర్ 17: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని విద్యను అందరికీ అందించేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలామల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్మీకి జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా సమీకృత బీసీ భవనాలు, వసతి గృహాల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బీసీ వెల్ఫేర్ అధికారి కె. రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 17 : నిర్మల్ పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, సీపీవో జీవరత్నం, డీఎస్‌వో కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన గోవర్ధన్

బాధ్యతలు స్వీకరిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర, అక్టోబర్ 17 : బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఉన్న ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ నుంచి ఆయనకు బాధ్యతలను అప్పగించారు. అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రణదీర్ సాగి నూతన వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నాడు.

కేటీఆర్ సమావేశానికి బీఆర్ఎస్వీ నాయకులు

హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ ఉట్నూర్ నాయకులు

ఉట్నూర్, అక్టోబర్ 17 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశానికి ఉట్నూర్ బీఆర్ఎస్వీ నాయకులు వెళ్లారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, సమస్యలపై పోరాడడం వంటి వాటిపై దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెళ్లు శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, నాయకులు సతీశ్, రామగిరి వాసు, బాబా శ్యాం, గిరి, క్రాంతి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సవాలక్ష కొర్రీలు

నిరాసక్తత చూపుతున్న పట్టభద్రులు

- అధికారుల్లో కొరవడిన అవగాహన
- పని చేయని హెల్ప్‌లైన్ నంబర్లు

నిర్మల్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ) : త్వరలో జరగనున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నిక కోసం కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియలో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నట్లు పట్టభద్రులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్‌లో సందేహాలు ఉన్నాయని, నివృత్తి చేసుకోవడానికి హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసినా పని చేయడం లేదని వాపోతున్నారు. నవంబర్ 1, 2024 కంటే కనీసం మూడేండ్ల ముందు డిగ్రీ లేదా తత్సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులుగా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అర్హులైన పట్టభద్రులు ఆఫ్‌లైన్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవడం వీలుకానప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే చాలా మంది పట్టభద్రులు పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యేందుకు హైదరాబాద్, ఇతర ప్రధాన నగరాల్లో ఉంటూ శిక్షణ పొందుతున్నారు. అలాగే కొంతమంది ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అలాంటి వారు ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడం వీలుకాక, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇలా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ సంబంధిత రెవెన్యూ కార్యాలయాలకు వచ్చి అవసరమైన ఫారాలపై సంతకాలు చేయాలని అధికారులు పేర్కొంటుండడంతో దరఖాస్తుదారులు మండిపడుతున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు వ్యయ ప్రయాసాలకు ఓర్చి కేవలం సంతకం కోసం రావడం అంటే ఆర్థికంగా భారం కావడంతో ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్ట పడడం లేదు. ఆన్‌లైన్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసిన తర్వాత కూడా సంతకం చేయాలనడం, స్వయంగా వచ్చి సర్టిఫికెట్స్ చూపించాలని పేర్కొనడంతో ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ నత్తనడకన సాగుతున్నది. ఇలా అయితే ఆఫ్‌లైన్ ఎన్‌రోల్‌మెంటుకు, ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంటుకు తేడా ఏముందని పట్టభద్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులకు అవగాహన లేకపోవడం కొసమెరుపు. జిల్లా ఎన్నికల అధికారులు పట్టభద్రుల ఓటరు నమోదులో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే అర్హత ఉండి కూడా ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తుందని గ్రాడ్యుయేట్స్ వాపోతున్నారు.

నత్తనడకన ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్



నిర్మల్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ఫ్లెక్సీ

❖ ఓటరు నమోదుకు ముందుకు రారు..

మా సొంతూరు సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామం. నేను ఎంటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. మొదటి సారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం వచ్చింది. ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అన్ని ఒరిజినల్స్ అప్‌లోడ్ చేశా. అయినా ఓటరుగా నమోదు కావడం లేదు. మళ్లీ సొంత మండలానికి వచ్చి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంతకాలు చేయాలంటున్నారు. అలాగే సర్టిఫికేట్ వెరిఫికేషన్ కూడా చేయించుకోవాలట.. ఉద్యోగానికి సెలవు పెట్టి 250 కిలో మీటర్లు ప్రయాణించి రావాలంటే కష్టమే. నేనే కాదు ఇలాంటి ఆంక్షలు పెడితే ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రారు.

- ఎం భోజరాజు, ఎంటెక్, జామ్, సారంగాపూర్ మండలం.

పిడుగుపాటుకు 40 గొర్రెలు, మేకల మృతి

పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు, మేకలు

సారంగాపూర్, అక్టోబర్ 17 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని రాంసింగ్ తండా అటవీ ప్రాంతంలో గురువారం పిడుగుపాటుకు 40 గొర్రెలు, మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన చౌహాన్ వినేశ్ గొర్రెలు మేపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలో పిడుగు పడడంతో 40 గొర్రెలు, మేకలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. మృతిచెందిన జీవాల విలువ సుమారు రూ. 10 లక్షల వరకు ఉన్నట్లు తెలిపాడు. ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని కోరాడు.